క్లుప్తంగా

నేత్రపర్వం.. సీతారామ కల్యాణం



విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు

చౌడేపల్లె: పందిళ్లపల్లె పంచాయతీ దేవరగుడి పల్లెలో వెలసిన శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం శ్రీసీతారాముల కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. పంచాయతీ పరిధిలోని ఏడు గ్రామాల ప్రజల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు రాజశేఖ దీక్షితులు, కుమార స్వామి బృందం శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి కల్యాణాన్ని వీక్షించి తన్మయత్వం చెందారు. ఉట్లోత్సవం కోలాహలంగా జరిగింది. అన్నదానం చేశారు. రాత్రి దేవరగుడిపల్లె, అజ్జప్పల్లె, నడుమూరు, పందిళ్లపల్లె, కొత్తపల్లె, ముదిరెడ్డిపల్లె, బాలసముద్రం గ్రామాల్లో ఊరేగింపు జరిగింది.

రంజింపజేస్తున్న నాటక ప్రదర్శనలు



ఆదివారం జరిగిన నాటక ప్రదర్శన

శాంతిపురం: కర్లగట్టలోని శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయ మహా భారత ఉత్సవాల్లో భాగంగా పౌరాణిక నాటక ప్రదర్శనలు రంజింపజేస్తున్నాయి. ఆదివారం అర్జున తపస్సుమాను, అరణ్య పర్వం ఘట్టాలను సిద్దేశ్వర నాట్య మండలి కళాకారులు రక్తికట్టించారు. నాటక ప్రదర్శనను తిలకించేందుకు రోజూ పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నారు.

జాతర నిర్వహణపై సలహాల స్వీకరణ

పలమనేరు: పట్టణంలోని తిరుపతి గంగమ్మ ఆలయంలో వచ్చేనెల 14 నుంచి మొదలు కానున్న గంగజాతరకు సంబంధించి పెద్దల సలహాలు, సూచనలను స్వీకరించారు. ఆదివారం ఆలయంలో కమిటీ చైర్మెన్ నరేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గతంలో జరిగిన పొరబాట్లు పునరావృతం కాకుండా జాతరను పటిష్టంగా నిర్వహించేందుకు పెద్దలు సూచించిన సలహాలను ఆలయ కమిటీ ఆలకించింది.

మారెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

పలమనేరు: పట్టణంలోని మదనపల్లె రోడ్డులో వెలసిన శ్రీమారెమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలతో పాటుమజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

220 మందికి కంటి పరీక్షలు

సదుం: మండల కేంద్రంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ ఆవరణలో అరవింద్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 220 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేశారు. డాక్టర్ గిరీషా, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

యంత్ర సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు

పలమనేరు: పలమనేరు మదర్ థెరీసా ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు(బీటెక్ విద్యార్థులు) సేవా కార్యక్రమాల్లో భాగంగా గంగవరం మండలం కీలపట్లలో రైతులకు వ్యవసాయ యాంత్రీకరణపై అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో, కూలీల సమస్య లేకుండా యంత్రాలను వినియోగించి ఎలా పంటలు పండించాలో వివరించారు. కరస్పాండెంట్ రవీంద్రబాబు, చైర్మన్ సునీల్, అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ రాజేంద్రరెడ్డి, సర్పంచ్ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ కిశోర్ పాల్గొన్నారు.

27న కబడ్డీ పోటీలు

శాంతిపురం: దండికుప్పం పంచాయతీ చౌడంపల్లెలో ఈ నెల 27న కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ యూత్ టీం సభ్యులు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.30 వేలు, రెండు, మూడవ, 4వ బహుమతులుగా రూ. 20 వేలు, రూ.10 వేలు, రూ 5వేలను అందిస్తామని చెప్పారు. వివరాల కోసం 91772 35360ను సంప్రదించవచ్చని కోరారు.

ఎస్‌ఐ బాధ్యతల స్వీకారం



శ్రీనివాసులు

పెద్దపంజాణి: పెద్దపంజాణి ఎస్‌ఐగా టి.శ్రీనివాసులు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని రోడ్డు సేఫ్టీ విభాగం నుంచి ఆయన ఇక్కడికి బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు.

కీర సాగు.. ఆదాయం బాగు

- తక్కువ పెట్టుబడి.. నికర ఆదాయం
- పంట కాలం రెండు నెలలే
- ఏడాది పొడవునా సాగు చేసుకునే పంట
- ఆశాజనకంగా ధరలు

పలు రకాల పంటలు సాగు చేసి ఆశించిన ధరల్లేక ఆందోళనలో ఉన్న రైతన్నలకు తక్కువ పెట్టుబడి.. తక్కువ తడులు.. తక్కువ సమయంలో సాగయ్యే కీర దోస కల్ప తరువులా మారింది. స్థానిక మార్కెట్‌లోనే పంటను విక్రయించుకునే అవకాశం ఉండడంతో కూలీల సమస్య తగ్గుతోంది. ప్రస్తుత తరుణంలో దోస సాగు ఎంతో ఉత్తమమని ఉద్యానశాఖ సైతం ప్రోత్సహిస్తోంది.



పలమనేరు మండలంలోని గొల్లపల్లి సమీపంలో కీర దోస సాగు



కీర దోస కాయలు

పలమనేరు: వ్యవసాయ డివిజన్‌లో తీగ రకానికి చెందిన కీర దోస సాగు రైతులకు సిరులు కురిపిస్తోంది. ఈ పంట చిత్తూరు జిల్లా ఉష్ణోగ్రతకు చాలా అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుతం జిల్లాలోని పలమనేరు, పుంగనూరు, మదనపల్లె, కుప్పం నియోజకవర్గాల్లో ఎక్కువగా సాగు అవుతోంది. ఇసుకవాటం, ఎర్రటి, ఒండ్రునేలల్లో సాగు అవుతుంది. ముఖ్యంగా ఉదజని సూచిక 6.0–6.7 ఉన్న నేలలు పంటకు అనుకూలంగా ఉంటుంది. ఏడాది పొడవునా పంటను సాగు చేసుకోవచ్చు. ప్రస్తుతం పలు హైబ్రిడ్ రకాల విత్తనాలను స్థానికంగా రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఎక్కువగా విటమిన్ ఏ, సీ ఉంటుంది. దాహాన్ని తీర్చగలిగే గుణం ఉన్న కాయ ఇది. వేసవిలో మంచి డిమాండ్ ఉంటుంది.

ఎకరాకు రూ.3 లక్షల ఆదాయం

ఎకరాకు 350 గ్రాముల విత్తనాలు సరిపోతాయి. ప్రస్తుతం దోస కిలో రూ.18 నుంచి రూ.20 వరకు ధర ఉంది. ఆలెక్కల టన్ను ధర రూ.18 వేలు. ఎకరాకు 20 టన్నులు దిగుబడి వచ్చినా, రూ.3.60 లక్షలు వస్తుంది. ఎకరాకు ఖర్చు రూ.60 వేలు పోయినా రూ.3లక్షల నిఖర ఆదాయం పొందవచ్చు.

ఎకరాకు ఐదు టన్నుల దిగుబడి

పలమనేరు హార్టీకల్చర్ డివిజన్‌లో 200 హెక్టార్ల విస్తీర్ణంలో కీర సాగులో ఉందని సహాయ సంచాలకులు డాక్టర్ కోటేశ్వరావు తెలిపారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న రైతులు తక్కువ పెట్టుబడితో తక్కువ కూలీలతో సులభంగా సాగయ్యే కీర దోసపై దృష్టి సారించాలన్నారు. మంచి పంట యాజమాన్య పద్ధతులను పాటిస్తే ఎకరాకు నాలుగు నుంచి ఐదు టన్నుల దిగుబడిని సాధించవచ్చని తెలిపారు. సాగు విధానం, సస్యరక్షణ చర్యలను ఆయన వివరించారు.

- ఎకరాకు ఐదు టన్నుల మరిగిన పశువుల ఎరువు వేయాలి.
- 40 కిలోల భాస్వరం, 24 కిలోల పొటాష్, 40 కిలోల నత్రజని ఎరువులను వాడాలి
- నత్రజనిని నాటేటపుడు, నాటిన 25 రోజులకు వేయాలి.
- రెండున్నరమీటర్ల ఎడంతో 60 సెంమీ వెడల్పు నీటి కాలువలను సిద్ధం చేసుకోవాలి.
- కాలువకు ఇరువైపులా 30 నుంచి 50 సెంటీమీటర్ల ఎడంతో విత్తనాలను విత్తాలి.
- పంట ప్రథమ దశలో, కాయ దిగేటప్పుడు మాత్రం నీటిని ఎక్కువగా, మిగిలిన కాలంలో తక్కువగా ఇవ్వాలి.
- పందిరి కూరగాయలకు ఇచ్చే సస్యరక్షణ చర్యలను పాటిస్తే సరిపోతుంది.
- కలుపు నివారణకు మెటలాక్లోర్‌ను వాడాలి
- పంటలో ఆడ పూలు ఎక్కువగా వస్తాయి. పిందె బాగా నిలిచేందుకు మూడు ఆకుల స్టేజ్‌లో బోరాక్స్‌ను లీటరు నీటికి రెండు గ్రాములు చొప్పున పిచికారీ చేయాలి
- పూత రావడానికి ముందు తీగ చివర్లను తుంచడంతో పక్కతీగలు అభివృద్ధి చెంది దిగుబడి పెరుగుతుంది.

ప్రస్తుతం గిట్టుబాటు...



ప్రస్తుతం టమాట, బంగాళాదుంప, క్యాబేజీ లాంటి పంటలకు ధరలు లేవు. కేవలం కీర దోస రైతులకు మాత్రం మంచి లాభాలు వస్తున్నాయి. మొన్నటి వరకు టన్ను రూ.15 వేలున్న ధర ఇప్పుడు రూ.18వేల దాకా ఉంది. రైతులు డిమాండ్ ఉన్న ఇలాంటి పంటలను సాగుచేసుకోవడం మేలు.

– గజేంద్ర, రైతు, తొప్పనపల్లె, పలమనేరు మండలం

1 నుంచి బ్రహ్మోత్సవాలు

కుప్పం: పట్టణంలోని రాధాకృష్ణ రోడ్డులో వెలసిన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మే నెల ఒకటో తేదీ నుంచి జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. వారం రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాల్లో నిత్యం ప్రత్యేక అభిషేక పూజలు, 4వ తేదీ శ్రీసీతారాముల కల్యాణోత్సవం, 5వ తేదీ రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం శయనోత్సవం, అన్నదానం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

పెద్దపంజాణి: మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులందరూ హాజరవుతారని పేర్కొన్నారు. గ్రామ సచివాలయాల్లోనూ స్పందన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. అర్జీదారులు గ్రామానికి సంబంధించిన సమస్య అయితే సచివాలయాల్లో, మండలానికి సంబంధించిన సమస్య అయితే తహసీల్దార్ కార్యాలయంలో అర్జీలు ఇవ్వాలని తెలిపారు.

6న అంకురార్పణ పూజలు

పుంగనూరు: మండలంలోని కుమ్మరగుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీబురడగుంట గంగమ్మ ఆలయంలో మేనెల 6న గణపతిపూజ,అంకురార్పణ, 7న విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- వైఎస్సార్‌సీపీ నాయకుడికి తీవ్ర గాయాలు



భాకరాపేట ఘాట్‌లో బోల్తా పడిన కారు

రొంపిచెర్ల: భాకరాపేట ఘాట్‌లో ఆదివారం కారును ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యుగంధర్‌రెడ్డికి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు ..తిరుపతి నుంచి రొంపిచెర్లకు యుగంధర్ రెడ్డి కారులో వస్తున్నారు. భాకరాపేట ఘాట్‌లో కారును రాయచోటి డిపో ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు రోడ్డు పక్కగా దూసుకెళ్లి బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న యుగంధర రెడ్డికి తీవ్ర గాయలు అయ్యాయి. ఆయనను చికిత్స కోసం తిరుపతిలోని ఓ ప్రవేటు ఆస్పత్రికి తరలించారు. కారు కూడా పూర్తిగా దెబ్బతితింది. సమాచారం అందుకున్న పలువురు నాయకులు ఆస్పత్రికి వెళ్లి యుగంధర్‌రెడ్డిని పరామర్శించారు. యుగంధర్ రెడ్డి ఆరోగ్యంపై అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమాచారం తెలుసుకున్నారు.

జెడ్పీటీసీ సభ్యుడు కేశవులకు పరామర్శ



జెడ్పీటీసీ సభ్యుడు కేశవులను పరామర్శిస్తున్న నేతలు

బైరెడ్డిపల్లె: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.కేశవులను ఆదివారం నాయకులు పరామర్శించారు. వారం కిందట ద్విచక్ర వాహనంలో వెళుతుండగా కొనమానసపల్లె వద్ద అదుపుతప్పి కింద పడిన ప్రమాదంలో కేశవులు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి గుడిపాల మండలంలోని చీలాపల్లె సీఎంసీలో ఆయన చికిత్స పొందుతున్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ కార్యదర్శి బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శి దయానందగౌడు ఆయనను పరామర్శించారు. ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

బోయకొండలో భక్తులకు వసతులు



సూచనలిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యదర్శి పెద్దిరెడ్డి, ఈఓ చంద్రమౌళి

- భక్తుల సదుపాయాలపై ఆరా
- అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి
- కాంట్రాక్టర్లతో సమావేశమైన పెద్దిరెడ్డి

చౌడేపల్లె: భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే ధ్యేయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి స్పష్టంచేశారు. ఆదివారం బోయకొండ అమ్మవారి ఆలయాన్ని ఆయన సందర్శించారు. భక్తుల సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి భక్తుడికి తీర్థప్రసాదాలు అందేలా చర్యలు చేపట్టంతోపాటు, ప్రసాదాల విక్రయాల కౌంటర్‌లను పెంచడం అభినందనీయమని భక్తులు ప్రశంసించారు. ఎండ తీవ్రత లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పెద్దిరెడ్డి మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు బోయకొండలో భక్తులకు మౌలిక సదుపాయాలు, సులభతరంగా దర్శన భాగ్యం పొందేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి రూ.కోట్లతో ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇంకా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అనంతరం కాంట్రాక్టర్లతో సమావేశమై పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. దేవస్థానం ఈఓ చంద్రమౌళి, మాజీ ఎంపీపీ అంజిబాబు, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కల్యాణ్‌భరత్ నేతలు సోమల మల్లికార్జునరెడ్డి, సురేంద్రరెడ్డి, రాశెట్టి మధు, నవీన్ తదితరులున్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

శ్రీబోయకొండ గంగమ్మ ఆలయంలో సోమవారం ఉదయం హుండీ కానుకలను లెక్కిస్తున్నట్లు దేవస్థానం ఈఓ చంద్రమౌళి తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఆలయ, బ్యాంకు, పోలీసు సిబ్బంది పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆనాటి ఆ స్నేహమానంద గీతం..



చౌడేపల్లెలో 41 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

చౌడేపల్లె: చౌడేపల్లె ఉన్నత పాఠశాలలో 1971–72 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఒక్కటయ్యారు. స్థానిక బైసాని కల్యాణ మండపం వీరి కలయికకు వేదిక అయింది. పూర్వ విద్యార్థులు బైసాని కృష్ణమూర్తి, చంద్రగిరి వెంకటసిద్దు వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి తమ బ్యాచ్ వారిలో 40 మంది నంబర్లు సేకరించారు. 41 సంవత్సరాల తరువాత అందరూ కలుసుకున్నారు. నాటి మధురానుభూతులను నెమరేసుకున్నారు. గురువులతో కలిసి ఆహ్లాదకరంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి సాయం చేయాలని తీర్మానించారు. నాటి గురువులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

నేడు రొంపిచెర్ల మండల మీట్

రొంపిచెర్ల: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజేంద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ప్రజాప్రతి నిధులు, మండల శాఖ అధికారులు తప్పని సరిగా హాజరు కావాలన్నారు. శాఖల వారీగా అభివృద్ధి పనులపై చర్చ ఉంటుందని తెలిపారు.

పుస్తకం.. ఓ మంచి నేస్తం



పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు

పలమనేరు: ఓ మంచి పుస్తకం వందమంచి స్నేహితులతో సమానమని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు తెలిపారు. ఆదివారం పట్టణ సమీపంలోని కళామందిరంలో సమితి ఆధ్వర్యంలో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తలదించుకుని పుస్తకం చదివితే భవిష్యత్తులో తలెత్తుకొని జీవించడం తెలుస్తుందన్నారు. చిరిగిన చొక్కా తొడుక్కో...కానీ ఓ మంచి పుస్తకాన్ని మాత్రం కొనుక్కో అన్న మహానుభావుల మాటలు అక్షర సత్యాలని తెలిపారు. విద్యార్థులు పుస్తక పఠనాన్ని ఆసక్తిగా మలుచుకోవాలని తెలిపారు. విద్యార్థులకు ఆయన 200 పుస్తకాలను పంపిణీ చేశారు. గంగవరం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పరశురాం, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, సంస్థ కార్యదర్శి పుష్ప తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



సదుం: స్థానిక సీహెచ్‌సీలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 26 మంది క్షయ రోగులకు ఆదివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. వైద్యాధికారులు గిరీషా, శ్రీధర్ మాట్లాడుతూ..రోగులు క్రమం తప్పకుండా సూచించిన మేర మందులు, పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధి నయం అవుతుందన్నారు. వ్యాధిపై అనుమానం ఉన్న వారు వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న జంగమ సేవా సంఘం నేతలు

ఘనంగా బసవ జయంతి

పెద్దపంజాణి: మండలంలోని ముత్తుకూరు గ్రామంలో వెలసిన శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో పెద్దపంజాణి మండలం వీరశైవ లింగాయత్ జంగమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీజగద్గురు మహాత్మా బసవేశ్వరస్వామి 890వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆలయంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి, విశాలాక్ష్మి, వినాయకస్వామి, సుబ్రమణ్యస్వామికి అభిషేక పూజలు, అలంకరణలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వీరశైవ లింగాయత్ డైరెక్టర్ శోభారాణి, న్యాయవాది మనోహర్, సంఘం అధ్యక్షుడు మల్లేశయ్య, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పలమనేరు: పట్టణంలోని బసవేశ్వరస్వామి ఆలయంలో బసవేశ్వర మహారాజ్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర మురళీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణంలోని లింగాయత్ కులస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బడుగుమాకులపల్లెలో ట్రాఫిక్ సంత

కుప్పం–పలమనేరు జాతీయ రహదారిలో జిల్లా స్థాయిలో గుర్తింపు ఉన్న బడుగుమాకులపల్లె సంత ప్రాంతంలో ఆదివారం ట్రాఫిక్ కష్టాలతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. జాతీయ రహదారిలో సుదూర ప్రయాణాలు, అత్యవసర ప్రయాణాలు చేసే వారు గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కోవలసి వస్తోంది. పోలీసులు, పంచాయతీ అధికారుల దృష్టికి ఈ సమస్య వెళుతున్నా పట్టించుకోవడం లేదు.



ఆదివారం సంత ప్రాంతంలో జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్



బడుగుమాకులపల్లె సంత ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తీవ్రతను తెలిపే గూగుల్ మ్యాప్ చిత్రం

శాంతిపురం: కుప్పం–పలమనేరు జాతీయ రహదారిలో ఆదివారం ప్రయాణించే వారిని ట్రాఫిక్ సమస్య తరచూ ఇబ్బందులకు గురి చేస్తోంది. జిల్లా స్థాయిలో గుర్తింపు ఉన్న బడుగుమాకులపల్లి సంత ప్రాంతంలో ప్రధానంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకూ ఈ సమస్య తీవ్రంగా ఉంటోంది. దండికుప్పం క్రాసు నుంచి దాదాపు 200 మీటర్ల దూరంలోని చర్చి వరకూ వాహనాలు వెళ్లేందుకు 30 నిమిషాల సమయం పడుతోంది. ఒక్కోసారి గంటల సమయం కూడా పడుతుంది. జాతీయ రహదారి పక్కనే వారపు సంత జరుగుతుండగా స్థానికులతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి రైతులు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి పశువులు తీసుకు వస్తుంటారు. జాతీయ రహదారి పక్కన ప్రాంతం సరిపోక రోడ్డుపైనే పశువులు, మనుషులు నిండిపోతున్నారు. దీనికి తోడుగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు రోడ్డు పక్కగా పార్క్ చేసి ఇరుకుగా మార్చేస్తున్నారు. ఆ సమయంలో భారీ వాహనాలు వస్తే అవి ముందుకు కదలలేక, మిగతా వాహనాలకు దారి లేక డ్రైవర్లు ఆపసోపాలు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్సులు వచ్చినా అవి ముందుకు సాగే పరిస్థితి లేకుండా పోతోంది. ట్రాఫిక్ నిర్వహణ కోసం పోలీసు అధికారులు సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నా వారు సంతలో ఇతర వ్యవహారాల్లో నిమగ్నమై అసలు పనిని గాలికి వదిలేస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ యంత్రాగం అయితే ఆదాయం వస్తే సరే అన్నట్లు పట్టించుకోవడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి సంత రోజుల్లో జాతీయ రహదారిలో ట్రాఫిక్ స్తంభించకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. పోలీసుల పర్యవేక్షణ పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

భగవద్గీత పఠనంతో జ్ఞానం



ప్రబోధానంద రచనలపై ప్రచారం

కుప్పంరూరల్: భగవద్గీత పఠనంతోనే జ్ఞానం, శాంతి లభిస్తుందని ప్రబోధానంద సేవా సమితి ప్రతినిధి కృష్ణ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మోట్లచేను, కాలనూరు, బొగ్గపల్లె గ్రామాల్లో ప్రబోధానంద రచనలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ, జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు రకాల ఆత్మలు ఉంటాయని, వీటిలో ఆత్మను ఆరాధించడంతోనే ధర్మస్థాపన సాధ్యమని అన్నారు. ప్రబోధానంద 99 రకాల రచనలు చేశారని, ఇందులో త్రైత సిద్ధాంత భగవద్గీత ఒకటి అన్నారు.